క్లుప్తంగా

1 నుంచి మెగా లోక్ అదాలత్

హఫీజ్‌పేట్: కూకట్‌పల్లి కోర్టులో జూన్ 1 నుంచి మెగా లోక్ అదాలత్ జరుగుతుందని మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కిరణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్ లేని కేసులలో పట్టుబడిన వారు మియాపూర్ ట్రాఫిక్ స్టేషన్‌కు ఆధార్ కార్డు, వాహన ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ జిరాక్స్ 3 కాపీలు, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరు ఉదయం 8 గంటలకు హాజరవ్వాలన్నారు.

డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2023–24 సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మీ సేవ సెంటర్‌లో (లేదా) కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు బీఏ, బీకాం, కంప్యూటర్, బీఎస్సీలో ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంసీసీఎస్ ,బీజెడ్ సీ,బీజెడ్ సీఎస్ గ్రూపలలో ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో సుమారు 720 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొదటివిడతలో రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు చివరి తేదీ జూన్10 అని తెలిపారు.

కార్మికులకు అండగా సీఐటీయూ



మాట్లాడుతున్న మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: సీఐటీయూ కార్మికులకు అండగా ఉంటుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ పేర్కొన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవంను పురస్కరించుకొని మంగళవారం పటాన్‌చెరులోని శ్రామికభవన్‌లో జరిగిన సెమినార్‌లో మల్లికార్జున్ మాట్లాడుతూ... కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పోరాడుతున్న ఏకైక సంఘం సీఐటీయూ అని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్య, పాండురంగా రెడ్డి, వాజీద్ అలీ, సుధాకర్, శ్యామ్, సంతోష్, రామ కృష్ణ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధి శివమ్మ కాలనీలోని రామాలయం రెండవ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ఆలయ చైర్మన్ బాస్‌పల్లి రామచందర్, వైస్ చైర్మన్ కాయిత నరసింహులు, జనరల్ సెక్రటరీ నిమ్మచెట్టు సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని సోని కాంప్లెక్స్‌లో మహిళల స్వయం ఉపాధి కోసం బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్కు, జూట్ బ్యాగ్‌ల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంజీవరెడ్డి ఫౌండేషన్ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణలో పాల్గొనే వారు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు ఫొటోలతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. బ్యాచ్‌కి 10 సీట్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9396161936 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పాపమ్మ బస్తీ నుంచి చంద్రమ్మ కాలనీ వరకు 12.5 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్ల కోసం 5 లక్షల రూపాయల అదనపు నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు చిన్నోళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గేడ్ల శ్రీనివాస్, శ్రీను, ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ ఏదీ?

అధ్వానంగా శాంతినగర్ పార్కు

- ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- చెత్తచెదారం, క్రిమికీటకాల సంచారం
- పార్కులో మద్యం బాటిళ్లు, సిగరెట్ బాక్సులు
- అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



మియాపూర్: హఫీజ్‌పేట్‌లోని శాంతినగర్ పార్కు అధ్వానంగా తయారైంది. పిచ్చిమొక్కలు, చెత్త, చెదారంతో నిండిపోయి కనీసం అడుగుపెట్టేందుకు వీలు లేకుండా ఉంది. లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసిన పార్కు నిర్వహణ విషయంలో శ్రద్ధ చూపకపోవడంతో అపరిశుభ్రంగా తయారైంది.వాకింగ్ ట్రాక్ మొత్తం పూర్తిగా మొక్కలతో నిండిపోయింది. దీంతో వాకర్స్ రావడం లేదు. ఈ పార్కులో హరితహారం పేరుతో మొక్కలు నాటారు. కానీ పర్యవేక్షణ లేక అడవిని తలపిస్తోంది. ఈ పార్కులో క్రిమికీటకాలు తిరుగుతున్నాయని, చుట్టు పక్కల ఇళ్లలోకి వస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పార్కులు అందుబాటులో లేకపోవడం, సరైన ఆట వస్తువులు లేక సెలవురోజుల్లో పిల్లలు రోడ్లపై ఆడుకుంటూ ప్రమాదాలబారిన పడుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఇక వృద్ధులు రోడ్లపై వాకింగ్ చేసేటపుడు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కు నిర్వహణ లేకపోవడంతో అక్కడ చుట్టుపక్కల వారు చెత్త, చెదారం వేస్తున్నారు. ఇక రాత్రి వేళ్లలో మందుబాబులకు అడ్డాగా మారిందని, పార్కులో ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు, సిగరెట్ బాక్సులు, చెత్తతో దర్శనమిస్తోంది. ప్రజాప్రతినిధులు పార్కును అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అడవిని తలపిస్తోంది..

హరితహారం పేరుతో పార్కును మొక్కలతో నింపారు. దీంతో దట్టమైన అడవిని తలపిస్తోంది. చెత్త, చెదారం, పిచ్చిమొక్కలు ఉండడంతో పార్కులో అడుగు పెట్టడానికి భయమేస్తోంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో పాములు, తేళ్లు, తిరుగుతున్నాయి. – నాగమణి, స్థానికురాలు

ప్రజాధనం వృథా

శాంతినగర్ పార్కులో ఖాళీ స్థలం లేకుండా మొక్కలు నాటారు. పిల్లలు ఆడుకోవడానికి స్థలం లేదు. ఆట వస్తువులు లేవు. పార్కులు అంటే పిల్లల ఆట వస్తువులు, విశాల స్థలం.. పచ్చదనంతో నిండి ఉండాలి. కానీ ఈ పార్కు అడవిని తలపిస్తోంది. – కృష్ణ, స్థానికురాలు



శాంతినగర్ పార్కులో పిచ్చి మొక్కలు



పార్కులో మద్యం బాటిళ్లు



కొండాపూర్ ఆస్పత్రిలో స్వచ్ఛభారత్



ఆస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న డాక్టర్ వరదాచారి, సిబ్బంది

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో మంగళవారం చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ప్రాంగణంలో చెత్తను తొలగించారు. సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని, ప్రతి ఒక్కరు ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, అటెండెంట్లు ఎక్కడ పడితే అక్కడ చెత్త, వ్యర్థాలను వేయవద్దని సూచించారు.

'ప్రజాస్వామ్య విలువలను మరింత ఇనుమడింపచేస్తుంది'



కొత్త పార్లమెంటు భవనం ముందు ప్రదీప్‌కుమార్ రామన్‌చర్ల బృందం

రాయదుర్గం: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఎదుగుతున్న భారతదేశంలో ఈ కొత్త పార్లమెంటు ప్రజాస్వామ్య విలువలను మరింతగా ఇనుమడింప చేస్తుందని, భవన నిర్మాణంలో సీబీఆర్‌ఐ పాత్ర ఉండడం సంతోషదాయకం అని సీబీఆర్‌ఐ డైరెక్టర్, ట్రిపుల్‌ఐటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొ. ప్రదీప్‌కుమార్ రామన్‌చర్ల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వడ్ల తరుగును ప్రభుత్వమే భరించాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: వడ్ల కొనుగోలులో తరుగును రాష్ట్ర ప్రభుత్వమే భరించడంతో బాటు వెంటనే నగదును రైతుల ఖాతాలో జమ చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు వడ్లు తడిసి రైతులు నష్టపోయారని, కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారని తెలిపారు. వడ్లు భద్రపరుచుకోవడానికి సరైన వసతి లేక, సంచులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం స్థానిక ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కనీసం సమయానికి నగదు ఇవ్వడం లేదని దీనికి తోడు తరుగు భారం కూడా రైతులపై వేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని ఐకేపీ సెంటర్లలో సరైన వసతులు కల్పించాలని కోరారు. లేని పక్షంలో బీజేపీ తరపున రైతులతో కలసి పోరాడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు దేవేందర్‌గౌడ్, భారతీనగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు వీరారెడ్డి, బీజేవైయం అసెంబ్లీ కన్వీనర్ రాజ్‌గోపాల్ యాదవ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్‌రాజ్, సోషల్ మీడియా కన్వీనర్ సంగమేష్, రమణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గీతం ప్రాంగణంలో చెట్లకు జియో ట్యాగ్



పటాన్‌చెరు: గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని చెట్లు, మొక్కలు, పొదలు, తీగ జాతులకు మంగళవారం జియో ట్యాగ్ చేశారు. వాటికి అమర్చిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆయా మొక్కల వృక్ష శాస్త్ర, సాధారణ పేర్లతో కూడిన వివరాలతో పాటు వాటి వర్గీకరణ, పుష్ప లేదా ఫలాల వివరాలన్నీ లభిస్తాయి.గత మూడు నెలలుగా మూడు ప్రాంగణాలలోని చెట్ల జాతులకు క్యూఆర్ కోడ్లను ట్యాగ్ చేస్తున్నట్టు గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, విశాఖపట్నం సీనియర్ ప్రొఫెసర్ కె.మోహన్ తెలిపారు. రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



బంజారాహిల్స్: హిమాయత్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉన్న శ్రీ పద్మావతి గోదాస మేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 18వ వార్షిక మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం శ్రీవారి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. నగర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు రథం ఊరేగింపులో పాల్గొని పునీతులయ్యారు. సాయంత్రం స్వామివారు అశ్వవాహనంపై తిరువీధుల్లో ఊరేగారు.

కాలనీల్లో గడపగడపకూ బీజేపీ



రాజరాజేశ్వరికాలనీలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవికుమార్

గచ్చిబౌలి: గడపగడపకూ బీజేపీ కార్యక్రమంను 43వ రోజు కొండాపూర్ డివిజన్ రాజరాజేశ్వరి నగర్, గోల్డెన్ తులిప్ ప్రాంతాలలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆయా కాలనీల్లో పార్టీ నాయకుడు రవికుమార్ యాదవ్ ఇంటింటికి తిరుగుతూ బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలోని బస్తీలు, కాలనీలు అన్నింటిలోనూ పూర్తి మౌలిక వసతుల కల్పన బీజేపీకే సాధ్యమన్నారు. ప్రజలు కోరినట్లుగానే అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో కబ్జాలు, అవినీతి ఎక్కువని ఆరోపించారు. కార్యక్రమంలో కృష్ణముదిరాజ్, ఆంజనేయులు, చంద్రశేఖర్‌యాదవ్, ఎల్లేష్, అనీల్‌కుమార్‌యాదవ్, రాజు,కిరణ్, మల్లేష్, నరేష్, మధుయాదవ్, మన్యం,పద్మ, పార్వతి, నాగులు, మల్లీశ్వరి, సాగర్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్రియల్ స్టూడియోస్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లో సర్రియల్ స్టూడియోను మంగళవారం నిర్వాహకురాలు ఐశ్వర్య ప్రారంభించారు. వివాహాది శుభకార్యాలతో బాటు అన్ని రకాల ఫొటో, వీడియో షూట్‌లకు ప్రొఫెషనల్ స్టైలింగ్ నిపుణులతో కూడిన బృందం అందుబాటులో ఉన్నారని తెలిపారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఎస్‌జేబీ హిల్స్, శ్రీహోమ్స్ కాలనీల్లో ఆయన పర్యటించారు. ఎస్‌జేబీ హిల్స్‌లో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు పనులు, ప్యాచ్‌వర్క్‌లను పరిశీలించారు. శ్రీహోమ్స్ కాలనీలో రోడ్డు నంబరు 2ఏలో రోడ్డు ఛిద్రమైందని, కొత్త సీసీ రోడ్డు వేయాలని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

డ్రంకన్ డ్రైవ్.. 14మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 14 మందికి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం..ఆది ,సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో 14మంది పట్టుబడగా వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 12 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా, ఒకరికి రూ.మూడు వేలు, మరొకరికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలు.. ప్రగతి ప్రతిబింబించాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ప్రతి కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించండి

పటాన్‌చెరు: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పది సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జూన్ 2వ తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన దశాబ్ది ఉత్సవాలలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తూ పదేళ్ల ప్రగతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాలపై నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 10 సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను పల్లె పల్లెనా ప్రతి ఒక్కరికి తెలిసేలా కార్యక్రమాలు రూపొందించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలను రంగురంగుల దీపాలతో అలంకరించాలని కోరారు. కార్మికుల కోసం రూ.300 కోట్ల అంచనా వ్యయంతో అతి త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రారంభించుకోనున్నట్లు తెలిపారు .20 రోజులపాటు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో తాను స్వయంగా పాల్గొంటానని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం వివిధ శాఖల అధికారులు దశాబ్ద కాలంలో సాధించిన ప్రగతిని నివేదికల రూపంలో వివరించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డీఎస్పీ భీంరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అరుదైన శస్త్ర చికిత్స

గచ్చిబౌలి: యాంకీలోజింగ్ స్పాండిలైటిస్‌తో బాధపడుతున్న 80 ఏళ్ల వృద్ధుడికి కొండాపూర్ కిమ్స్ వైద్యులు అరుదైన వెన్నుముక సర్జరీ చేసినట్లు స్పైన్ సర్జన్ డాక్టర్ కృష్ణ చైతన్య తెలిపారు. వెన్నుముక, మెడ భాగం గట్టిగా మారడంతో తల కిందకి వాలిపోవడంతో మూడేళ్ల నుంచి నిద్రలేక బాధపడుతున్నాడని పేర్కొన్నారు. కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రికి రావడంతో వైద్య పరీక్షలు చేసి పెడికిల్ సబ్‌ట్రాక్షన్ ఆస్టియోటమీ అనే శస్త్ర చికిత్స గురించి కుటుంబసభ్యులకు వివరించారు. రోగి వెన్నుముకను 3డి ప్రింటింగ్ తీసి ఇంట్రా ఆపరేటివ్ న్యూరల్ మానిటరింగ్ ద్వారా 8 గంటలు శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. ఎల్3 భాగం నుంచి 30 డిగ్రీల వెన్నుముకను తొలగించడంతో మెడ మామూలుగా నిలబెట్టగలిగే స్థితి వచ్చిందన్నారు. శస్త్ర చికిత్స అనంతరం వృద్ధుడు పూర్తిగా కోలుకున్నారని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 39 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.13,04,800 లక్షల చెక్కులను మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి రోగుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకుడు ఊట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



కల్కి సరోవర్‌లో నీటి సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని కల్కి సరోవర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మంజీరా మంచినీటి కుళాయిలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో నీరు లేక ఇబ్బందులు పడేవారని, నేడు ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. అదే విధంగా 2 వేల లీటర్ల ఉచిత మంచినీటిని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు రాంచంద్రం, పీఎస్ రావు, నర్సింహ్మా, శ్రీధర్, అన్సారీ, రమాదేవి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధునికీకరణకు ముందుకొచ్చిన రహేజాగ్రూపు

- మరిన్ని మౌలిక వసతులకు రూ.45 లక్షల సీఎస్‌ఆర్ నిధులు కేటాయింపు
- ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ కలిసి జిల్లా వైద్యాధికారులకు చెక్కు అందజేత

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునీకరణకు మార్గం సుగమం అయ్యింది. ఈ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధునీకరణకు రహేజా గ్రూపు సీఎస్‌ఆర్ నిధులు కేటాయించేందుకు ముందుకొచ్చింది. మంగళవారం చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటిశ్రీకాంత్‌లు కలిసి రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సృజనలకు సంస్థ అందించిన రూ.45 లక్షల చెక్కును అందజేశారు.

- ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆధునీకరించాలని ఆలోచన ఉందన్నారు. ఈ కోరిక రహేజా గ్రూపు సీఎస్‌ఆర్ గ్రూపు సీఎస్‌ఆర్ నిధుల ద్వారా ఆధునీకరణకు మార్గం సుగమమవుతోందన్నారు. ఈ పట్టణ ఆరోగ్య కేంద్రం అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.
- ఈ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సివిల్ వర్క్స్, శానిటరీ సౌకర్యాలు, తాగునీరు, ఎలక్ట్రిసిటీ, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఈ నిధులను కేటాయించాలని అధికారులకు వారు సూచించారు. శేరిలింగంపల్లి ప్రజల పక్షాన రహేజా గ్రూపు ప్రతినిధులకు, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దానికి ప్రైవేటు సంస్థలు కూడా తమ వంతు బాధ్యతగా చేయూతను అందించేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రహేజా గ్రూపును ఇతర సంస్థలన్నీ కూడా ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పసిబిడ్డ ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

గచ్చిబౌలి: ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓ పసికందుకు వైద్య సపర్యలు చేసి కాపాడారు 108 సిబ్బంది . కొండాపూర్ 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...... కొండాపూర్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మంగళవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో సుష్మితదాసు అనే మహిళ మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే పసికందు పల్స్ పడిపోయిందని, వెంటనే నిలోఫర్ ఆస్పత్రికి తరలించాలని చెప్పడంతో 108కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది పైలెట్ జలీల్, ఈఎంటీ నరేష్ పసికందును తీసుకొని నిలోఫర్ ఆస్పత్రికి బయలుదేరారు. ఈ క్రమంలో నరేష్ పసికందుకు వైద్య సపర్యలు చేసి ఊపిరి నిలిపాడు, గుండె ఆగిపోకుండా ఎన్‌ఎస్‌ఆర్ (సీపీఆర్ తరహాలో చిన్నపిల్లలకు చేసే ప్రక్రియ) చేశారు. శిశువుకు అవసరమైన ఆక్సిజన్ వెంటిలేటర్ సహాయంతో అందిస్తూ నిలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల పర్యవేక్షణలో బిడ్డ పరిస్థితి బాగానే ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పైలెట్ జలీల్, ఈఎంటీ నరేష్‌కు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో కొల్లూరు పోలీస్‌స్టేషన్ ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉస్మాన్‌నగర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న కొల్లూర్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నూతన ఏపోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో తెల్లాపూర్, ఉ స్మాన్‌నగర్, కొల్లూర్ ప్రజలకు సత్వర సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సంజయ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, ఉమేష్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, ఏఈ సంజయ్ పాల్గొన్నారు.